క్లుప్తంగా

సకాలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం

మాడుగుల రూరల్ : రీసర్వే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను 15 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని, మండల రీ సర్వే డీటీ కె.గణపతిరావు పేర్కొన్నారు. ఎం.కోడూరు సచివాలయంలో గురువారం జరిగిన రీసర్వే గ్రామ సభలో 44 మంది రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. మండల సర్వేయర్ జగదీష్, గ్రామ సర్పంచ్ సంజీవిరావు, వీఆర్వో, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో గ్రామసభ

మాడుగుల : మండలంలో ఎం.కోడూరు గ్రామంలో గురువారం సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ యాజమాన్య రికార్డుల్లో తప్పులు దొర్లిన వాటికి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరు లక్ష్మణరావు రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలు వాయిదా

గొలుగొండ : గొలుగొండ మండలంలో జరగాల్సిన 13 నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడినట్టు ఇరిగేషన్ ఏఈ రవికిరణ్ తెలిపారు. ఈనెల 23న జరగాల్సిన ఎన్నికలు వచ్చే నెల 8కి మార్చినట్టు తెలిపారు. డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల చేసి, 8 తేదీన 13 సంఘాల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

సహస్ర శివనామాలతో పూజలు



ఎం.కోడూరు మోదమాంబ ఆలయం వద్ద శివస్వాములు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులోని మోదమాంబ ఆలయంలో ఏర్పాటు చేసిన శివస్వాములు పీఠంలో గురువారం వెయ్యి శివనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలలు ధరించిన పడాల అప్పలనాయుడు, కాతా చిరంజీవి, వంజు వంజుల నాగరాజు, శీరా తలుపులునాయుడు, అప్పాన కోటీశ్వరావు, కాకర సన్యాసిరావు, గుమ్మాల నర్సింగరావు, జొన్నపిల్లి నాగరాజు, కోర్ని కుమార్, ఎస్. శంకరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా శివ మాల ధరించి పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజు రాత్రి పార్వతీ పరమేశ్వరులకు పూజలు నిర్వహిస్తున్నారు.

తాగునీటి పథకాలకు క్లోరినేషన్ యూనిట్‌లు



మాడుగులలో ఇన్‌లైన్ క్లోరినేషన్ యూనిట్ పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల : మండలంలో 69 మంచి నీటి పథకాలు వద్ద ఇన్‌లైన్ క్లోరినేషన్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక ఆర్‌సీఎం వద్ద ఉన్న మంచి నీటి పథకం వద్ద ఏర్పాటు చేస్తున్న ఇన్‌లైన్ యూనిట్‌ను పరిశీలించారు. మండలంలో 69 మంచి నీటి పథకాలకు ఇప్పటికే 30 ట్యాంకులకు యూనిట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం : మరిడమ్మ పండగను రెండు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తామరం, మాకవరపాలెంలో ఏటా పండగను వైభవంగా జరుపుకొంటారు. గురువారం ఈ రెండు గ్రామాల ప్రజలు ఉదయం నుంచి స్థానికంగా ఉన్న మరిడమ్మ ఆలయాలకు చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తామరంలో విద్యుత్ దీపాలంకరణతో పాటు రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు రుత్తల నారాయణమూర్తి, రామచంద్రరావు, నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

అక్కడ కళ కళ.. ఇక్కడ వెల వెల..

- గబ్బాడలో ఆగిన ఇసుక సరఫరా
- బలిఘట్టం కేంద్రంగా ఇసుక దందా
- ప్రభుత్వ డిపోలో నిలిచిన విక్రయాలు
- అధికారుల నిర్ణయంతో ఇసుక మాఫియాకు కాసులు



నిర్మానుష్యంగా గబ్బాడ ఇసుక డిపో



బలిఘట్టం వద్ద లారీలు, ట్రాక్టర్లతో ఇసుక డంపు

నర్సీపట్నం : గబ్బాడ ప్రభుత్వ ఇసుక డిపోలో ఇసుక అమ్మకాలు పక్షం రోజులుగా నిలిచిపోయాయి. గబ్బాడ ఇసుక డిపో వెలవెలబోతుంటే.. బలిఘట్టంలో ఇసుక వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతుంది. రెవెన్యూ అధికారులు విధించిన నిబంధనలు ఇసుక మాఫియాకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. 4 లేదా 5 టన్నులు తీసుకువెళ్లాలని అధికారులు నిబంధన విధించారు. డిపోలో నాలుగున్నర టన్నుల ఇసుక కొనుగోలు చేసి, నిర్మాణదారులకు ఐదు టన్నుల చొప్పున విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకునేవారు. ట్రాక్టర్ల యజమానులకు ఇది రుచించలేదు. దీంతో లారీల యజమానులతో వ్యాపారులు ఒప్పందం పెట్టుకుని బలిఘట్టంతో అనధికారిక ఇసుక డిపో తెరిచారు. వినియోగదారు మోసపోకూడదనే ఉద్దేశంతో అధికారులు తీసుకున్న నిర్ణయం మంచిదే అయినప్పటికీ, బలిఘట్టంలో జరుగుతున్న ఇసుక దందాను అధికారులు చూసిచూడనట్టు వదిలేసారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.

దర్జాగా ఇసుక పక్కదారి...

లారీల్లో ఇసుకను తీసుకొచ్చి బలిఘట్టం కర్రల డిపోలో ట్రాక్టర్లకు డంప్ చేసి వ్యాపారం చేస్తున్నారు. బలిఘట్టం కేంద్రంగా లక్షల్లో వ్యాపారం జరుగుతుంటే, గబ్బాడ ఇసుక డిపోలో అమ్మకాలు నిలిచిపోయాయి. రాజమండ్రి నుంచి లారీల్లో తెచ్చే ఇసుక ఏ వ్యక్తి పేరు మీద అయితే తీసుకువస్తారో ఆ వ్యక్తి చిరునామాకు చేర్చాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో బలిఘట్టం కేంద్రంగా ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగుతుంది. రోజుకు 10 నుంచి 15 లారీల ఇసుక వ్యాపారం జరుగుతుంది.

అనధికార డిపోలో అమ్మకాలు..

గబ్బాడ ప్రభుత్వ ఇసుక డిపోలో 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉంటే కేవలం 4756 మెట్రిక్ టన్నులు మాత్రమే అమ్ముడైంది. డిపోలో టన్ను ఇసుక రూ.1077. బలిఘట్టం అనధికారిక ఇసుక డిపోలో టన్ను రూ.900 చొప్పున విక్రయిస్తున్నారు.

లోడులోనూ అక్రమాలే...

రాజమండ్రి నుంచి ఇసుక తెచ్చే లారీల యజమానులతో ఇసుక వ్యాపారులు ఒప్పందం పెట్టుకున్నారు. ఐదు టన్నులకు బదులు నాలుగున్నర టన్నులు కొనుగోలు చేసి వినియోగదారులకు ఐదు టన్నుల చొప్పున విక్రయిస్తున్నారు. డిపోలో కాకుండా బయట కొనడం వల్ల టన్నుకు రూ.177 చొప్పున ట్రాక్టర్‌కు రూ.708 మిగులుతుంది. ఐదు టన్నులకు బదులు నాలుగున్నర చొప్పున విక్రయించడం ద్వారా రూ.2 వేలు లాభం చేకూరుతుంది. ట్రాక్టర్‌కు రూ.2708 లబ్ధి చేకూరుతుంది. రూ.5200లకు కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఇసుక నిర్మాణదారుకు రూ.6500 వేలుకు విక్రయిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్

నాలుగున్నర టన్నుల ఇసుకను ఐదు టన్నులుగా విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారని వినియోగదారుల నుంచి ఫిర్యాదు వచ్చిందని తహసీల్దార్ రామారావు తెలిపారు. ఫిర్యాదు మేరకు రౌండ్ ఫిగర్ పెట్టడం జరిగింది. బలిఘట్టంలో అనధికారిక ఇసుక అమ్మకాలను అరికడతామన్నారు.

టిడ్కో గృహాలకు నీటి సరఫరా

ఉత్తరవాహిని నదిని పరిశీలించిన అధికారులు



అధికారులతో కలిసి ఉత్తరవాహిని నదిని పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో సూపరింటెండింగ్ ఇంజినీర్ మూర్తి

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం, బయపురెడ్డిపాలెంలో నిర్మించిన టిడ్కో గృహాలకు నీటి సరఫరా సౌకర్యాన్ని కల్పించేందుకు ఏపీ టిడ్కో సూపరింటెండింగ్ ఇంజినీర్ డి.ఎస్. మూర్తి, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర గురువారం ఉత్తరవాహిని నదిని పరిశీలించారు. ప్రస్తుతం నర్సీపట్నంకు ఉత్తరవాహిని నుంచి నీటి సరఫరా జరుగుతుంది. ఇక్కడ నుండే టిడ్కో గృహాలకు నీటి సరఫరా ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. పైపులైన్ ఏవిధంగా వేయాలనే విషయమై టిడ్కో గృహాల సముదాయాన్ని పరిశీలించారు.

పంట దశలో రెక్కతెగులు

- రాలిపోతున్న గింజలు
- ఆందోళనలో అన్నదాతలు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మాడుగుల : ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ వరి చేలు సుమారు 14 వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఆర్‌జీఎల్ రకం సుమారు 8 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఆర్‌జీఎల్ పంట ప్రస్తుతం వెన్ను వంచి పండింది. మరో వారం రోజుల్లో వరి కోతలు జరుగుతాయని దిగుబడి బాగా వస్తుందని ఆశించారు. తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వస్తుందని ధీమా పడ్డారు. రెండు రోజుల నుండి ఆర్‌జీఎల్ వరి చేల వెన్నులు నుంచి రెక్క పురుగులు వెన్నులు కొరకడంతో గింజలు నేల రాలుతున్నాయని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఆర్‌జీఎల్ ఎక్కడ ఉన్నా సరే ప్రస్తుతం రెక్క తెగుళ్ల ఆశించాయి. ఈ విషయమై వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావును సంప్రదించగా ఈ తెగులు పెద్ద ప్రమాదం చూపదని, ఇమామెక్టిన్ బెంజేట్ 150 గ్రాములు మందు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు.

ఆధార్‌లో తప్పులు సరి చేసుకోండి



ఆధార్ కేంద్రంలో సేవలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష

నాతవరం: ఆధార్ కార్డులో తప్పుఒప్పులను సరి చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఆధార్‌కేంద్రాల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష అన్నారు. స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆధార్ కార్డులో తప్పుఒప్పులను సరి చేసుకునేందుకు అధికంగా విద్యార్థులు రావడంతో మరో రెండు రోజులు కేంద్రం నిర్వహించాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మండల ప్రత్యేకాధికారి అదనంగా మరో రోజు కేంద్రం నాతవరంలో ఉంటుందని, తర్వాత రోజు నుంచి మండల వ్యాప్తంగా కేటాయించిన తేదీల్లో ఆయా గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వాలాబు రోడ్డును బాగు చేయరూ..



ఎంపీడీవో కార్యాలయ ఏవో లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందిస్తున్న దొర తదితరులు

దేవరాపల్లి: గోతులమయంగా మారిన దేవరాపల్లి - వాలాబు రోడ్డును బాగు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. రోడ్డు ఛిద్రంగా మారవడంతో స్థానిక గిరిజన ప్రజలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. అలాగే ఈ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజుబాబు, ఇరటా దేముడు, బాలాజీ నాగేశ్వరరావు, కాదల రాము, జర్తా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇటు వానరాలు..అటు గ్రామ సింహాలు



పగలు ఇళ్లలోకి చొరబడుతున్న వానరాలు



రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై కుక్కలు

మాకవరపాలెం : పగలు వానరాలు, రాత్రిళ్లు కుక్కలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఇటీవల గ్రామాల్లో ఎక్కడ చూసినా వీటి బెడద అధికమైంది. మండలంలోని మాకవరపాలెం, తామరం, రామన్నపాలెం, రాచపల్లి, పైడిపాల, లచ్చన్నపాలెం. పి.పి.అగ్రహారం, తదితర ప్రాంతాల్లో కుక్కలు, వానరాల సంచారం ఎక్కువ కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పగలు వానరాలు ఇళ్లలోకి చొరబడి సామాగ్రిని ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో కుక్కలు ప్రధాన కూడళ్లలో గుంపులు గుంపులుగా తిరుగుతూ నడిచివెళ్లేవారిని గాయపరుస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెనుక టపరుగులు తీస్తుండడంతో ఒక్కో సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో వానరాలను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు బోన్లు ఏర్పాటు చేసేవారు. పంచాయతీ అధికారులు కుక్కలను సైతం పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించేవారు. ప్రస్తుతం కుక్కలు, వానరాల బెడద మళ్లీ ఎక్కువైందని, వాటి బెడద తప్పించాలని అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : ఎ.కోడూరు 11కేవీ ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో ఈ నెల 22న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్లను తాకుతున్న కొమ్మల నరికివేత పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈమేరకు ఫీడర్ పరిధిలో గల ఎ.కోడూరు, పాడుగుపాలెం, సూరెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, కొత్త అగ్రహారం, రామచంద్రపురం గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

దేవరాపల్లి: దేవరాపల్లిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. దేవరాపల్లి పరిధిలో విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సారా విక్రేత అరెస్టు



సారాతో నిందితుడు రామును పట్టుకున్న ఎస్ఐ శేఖరం

కె.కోటపాడు/ చోడవరం రూరల్ : కె.కోటపాడు మండలం కొరువాడ శివార్లలో నాటుసారాను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన కక్కల రామును గురువారం చోడవరం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామ శివారు గుండా 5 లీటర్ల నాటుసారాను ప్లాస్టిక్ క్యాన్‌లో తరలిస్తున్న రామును ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం పట్టుకున్నారు. గ్రామంలో నాటుసారా తయారీ చేయడం, విక్రయించడం నేరమని ఎస్ఐ ప్రజలకు సూచించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు పాల్గొన్నారు. నిందితుడుని అరెస్టు చేసి చోడవరంలో కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ నిమిత్తం సబ్ జైలుకు తరలించామని సీఐ కె.వి.పాపునాయుడు తెలిపారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



చౌడువాడలో అన్న సమారాధన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గల షిర్డీసాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్న సమారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రాజి శ్రీనివాసరావు, మోదినాయుడు, చల్లపల్లి శ్రీనివాసరావు, మారపురెడ్డి రమణ, సాయి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు అవసరం



గుల్లేపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు : శీతాకాలంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి తరణి సూచించారు. గుల్లేపల్లి గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు నిర్వహించారు. 137 మందిని తనిఖీ చేసి ఉచితంగా మందులు వేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. కనీస ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న దృష్ట్యా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్న వారు వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ



వ్యవసాయ కార్యాలయంలో శిక్షకులకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌సీ వ్యవసాయాధికారి విజేత

రోలుగుంట : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విత్తనోత్పత్తి పథకంపై మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి శిక్షణ కార్యాలయం నుంచి పాల్గొన్న డీఆర్‌సీ వ్యవసాయాధికారి పి.విజేత శిక్షణ ఇచ్చారు. వరిపంటపై రెల్ల రాల్చు పురుగు నివారణకు ఎకరాకు 80 గ్రాముల క్లోరంట్రానిలిప్రోల్‌ను వరి దుబ్బు చేరేటట్లు పిచికారి చేయాలని, కంకినల్లి నివారణకు బైఫెంత్రిన్ 500 ఎం.ఎల్ ఎకరా విస్తీర్ణంలో పిచికారి చేయాలని సూచించారు. మినుము విత్తనాలు వేసే ముందు టి.వీరిడి 10 గ్రాములు, కార్బండజిం 3 గ్రాములు మిశ్రమం చేసి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. విత్తనాలు చల్లిన 10–15 రోజులకు 2 బస్తాలు ఎస్ఎస్‌పి 10 కేజీల యూరియా, 10 కేజీల ఎంఓపి కానీ లేదా 19:19:19 పిచికారి చేయాలి. పూత దశకు ముందు వేపనూనె పిచికారి చేసుకోవాలని ఈ విధానాలు పాటించడం ద్వారా తెగుళ్ల నివారణతో ఆశించిన విధంగా పంటోత్పత్తితో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణలో రైతు ప్రతినిధులు అల్లు లక్ష్మణరావు, మాకిరెడ్డి శ్రీను, గ్రామస్థాయి వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి 99వ జయంతి వేడుకలు



పేదలకు ఆహారం అందిస్తున్న సత్యసాయి కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్ : మోదమాంబ కాలనీలో సత్యసాయిబాబా మందిరంలో 99వ జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం నారాయణసేవలో భాగంగా 10 మంది పేదలకు అన్నదానం చేశారు. యువజనోత్సవం నిర్వహించారు. ఉదయం 50 మంది యువకులు, మహిళలు, పురుషులు సారథ్యంలో ఓంకార సుప్రభాత నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

23 న జన్మదినోత్సవ వేడుకలు

ఈ నెల 23 శనివారం బాబా 99వ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉదయం 5 గంటలకు ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, మృత్యుంజయ హోమం, 9 గంటలకు సామూహిక సత్యసాయి వ్రతాలు, మధ్యాహ్నం హారతి, అనంతరం అన్న సమారాధన, రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం, సాయంత్రం పల్లకీ ఊరేగింపు, రాత్రి 7 గంటలకు నామసంకీర్తన, హారతి కార్యక్రమాలు ఉంటాయని సేవా సమితి సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

మంచినీటిని పొదుపుగా వాడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు, వేదికపై ఏపీఎం ప్రభాకర్, సీడీపీవో మంగతాయారు

దేవరాపల్లి : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన 'వాస్'(డబ్ల్యుఎస్‌హెచ్) కార్యక్రమంపై వీవోఏలు, సీసీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మంచినీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంటింటా కుళాయి, పైపులైన్లు లీకేజీలు లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు 5 లీటర్ల కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రెండేళ్లలోపు చిన్నారులు ఆకుకూరలు, కాయగూరలతో పాటు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునన్నారు. దేవరాపల్లి పీహెచ్‌సీ సిహెచ్‌వో పి.ప్రసాదరావు, హెచ్‌వి లక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు గుమ్మాల లావణ్య పాల్గొన్నారు.

వరిలో రెల్ల రాల్చు పురుగు బెడద



కలిగొట్లలో రెల్లరాల్చు పురుగు ఆశించిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ



వరి పంటను ఆశించిన రెల్లరాల్చు పురుగులు

దేవరాపల్లి: వరి సాగు ఆశిస్తున్న రెల్లరాల్చు పురుగుల పట్ల అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ అన్నారు. కలిగొట్లలో స్థానిక రైతులతో కలిసి గురువారం వరి పంటలను పరిశీలించారు. రెల్లరాల్చుపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. రెల్లరాల్చు పురుగు నివారణకు క్లోరిపైరిఫోస్ మందు 2 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 మి.లీ మందును కలిపి పిచికారి చేయాలన్నారు. మందు పిచికారిని సాయంత్రం పూట మాత్రమే చేపట్టాలని సూచించారు.

గోరువెచ్చని సూరీడమ్మా...



ఇది పెయింటింగ్ కాదు...ఆకాశంలో ప్రకృతి దిద్దిన సోయగం. సూరీడు అప్పుడే ఉదయించి మబ్బుల చాటున దోబూచులాడుతూ నునులేత కిరణాలతో శీతాకాలంలో నులువెచ్చని వెలుగును ప్రసాదిస్తున్న దృశ్యం చూపరులను అబ్బురపరిచింది. గురువారం ఉదయం ఆకాశంలో కనిపించిన మనోహర దృశ్యమిది.

– చోడవరం